

ఎస్‌జీఎఫ్ ఎంపికలు వాయిదా

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరగాల్సిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు వాయిదా పడినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వేర్వేరు వేదికలపై, వేర్వేరు క్రీడంశాలను ఈ నెల 20 నుంచి 24 వరకు జరగాల్సి ఉండగా, ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు కారణంగా వాయిదా పడినట్లు వారు తెలిపారు. తదుపరి తేదీలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులూ.. సమస్యలపై చర్చించరూ!



జిల్లా పరిషత్ సమావేశ మందిరం

- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
- ఎప్పుడూ కొన్ని శాఖలకే పరిమితం
- ప్రాధాన్యాలను పక్కన పెట్టేస్తున్న వైనం
- అభివృద్ధి జరగాలంటే సుదీర్ఘ చర్చ అవసరం

శ్రీకాకుళం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలోనే తలసరి ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాగా 'శ్రీకాకుళం' గుర్తింపు పొందింది. శ్రీకాకుళం.. వెనుకబడిన జిల్లా కాదు. వెనుకకు నెట్టబడిన జిల్లా అని తరచూ ప్రజాప్రతినిధులు చెబుతుంటారు. కానీ జిల్లా అభివృద్ధి విషయంలో వేదికగా ఉన్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కీలక ప్రజా ప్రతినిధులే గైర్హాజరవుతున్నారు. దీంతో ప్రాధాన్య విషయాలపై చర్చ జరగకుండా.. మొక్కుబడిగానే సమావేశం సాగిపోతోంది. సమస్యలకు పరిష్కారం కరువవుతోంది. ఆదివారం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశంలోనైనా ప్రజల సమస్యలపై ప్రజాప్రతినిధులు చర్చించి.. పరిష్కారం చూపాలని జిల్లావాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అందని వైద్యసేవలు

- జిల్లావ్యాప్తంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతీ గ్రామంలోనూ పదుల సంఖ్యలో జ్వరపీడితులు ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు సక్రమంగా అందక.. ప్రైవేటు ఆసుపత్రులను అధికంగా రోగులు ఆశ్రయిస్తున్నారు. ఫీజులు, మందుల కోసం వేలాది రూపాయలు చెల్లించి ఈసురోమంటున్నారు. గ్రామాల్లో జ్వరాల నియంత్రణకు పీహెచ్‌సీల వారీగా తీసుకుంటున్న చర్యలపై చర్చిస్తే ప్రయోజనం ఉంటుంది.
- శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చాలామంది వైద్యులు ప్రతిరోజూ హాజరు వేసుకుని.. కొన్ని నిమిషాల్లోనే తమ సొంత క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదు. అలాగే ప్రైవేటు క్లినిక్‌లపై కనీస తనిఖీలు లేవు. ఈ విషయమై సమగ్ర చర్చ సాగితే.. డ్యూటీవేళల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉంచేందుకు ఆస్కారం ఉంటుంది.

- 'యూరియా'.. ఇప్పుడు రైతాంగాన్ని పట్టిపీడిస్తుంది. జిల్లాకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా మంజూరైనా.. కొన్ని అవాంతరాలు వల్ల రైతుల్లో అలజడి నెలకొంది. ఎరువుల దుకాణాల్లో జరుగుతున్న తంతు... విజిలెన్స్ అధికారుల దాడులు.. ఇటువంటి వాటిపై చర్చించాలి. యూరియా కోసం రైతులు ఆందోళన చెందకుండా భరోసా కల్పించాలి.
- ప్రభుత్వాలు మారినా గ్రామాల్లో బెల్టు దుకాణాలు వేలం పాటతో ఏర్పాటు చేసుకున్నారు. ఇవి అనధికారికమే. అయినా.. వీటిపై నియంత్రణ లేదు. గ్రామాల్లో బెల్టు (మిగతా 6వ పేజీలో..)

సాగునీటి కష్టాలు

- పలాస నియోజకవర్గంలో వంశధార ఎడమ ప్రధానకాలువ శిథిలావస్థకు గురైంది. 2800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తేనే మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు సాగునీరు చేరుతుంది. కానీ కాలువ అధ్వాన స్థితి కారణంగా 1400 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తోంది. దీంతో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.
- వంశధార షట్టర్ల కుంభకోణంపై సీఐడీ కేసు.. దశాబ్దాల నుంచి కొనసాగుతోంది. అవసరమైన చోట షట్టర్లు లేక కాలువల నుంచి సాగునీరు అందక నరసన్నపేట, ఆమదాలవలస, టెక్కలి నియోజకవర్గ రైతులు అవస్థలు పడుతున్నారు.
- ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, పొందూరు మండలాలకు నారాయణపురం ఆనకట్ట, మడ్డువలస ప్రాజెక్టు, తోటపల్లి కాలువే ఆధారం. కాలువల తవ్వకాలు ఏళ్లతరబడిగా సాగుతున్నాయి. సాగునీరు సక్రమంగా అందడం లేదు. వీటిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది.

బార్లు మాకొద్దు



- ఒక్కో మండలం నుంచి ఒక్క దరఖాస్తు అయినా రావాల్సిందే. సిండికేట్ నుంచి విధిగా బారుకు దరఖాస్తు చేసుకోవాలి. లేదంటే మీ ఇష్టం. మాపై ఒత్తిడి ఉంది. మాకు సహకరించాల్సిన అవసరం మీపై ఉంది. లేదంటే మున్ముందు అందరికీ ఇబ్బందులు తప్పవు.

-ఇదీ మద్యం వ్యాపారులపై ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఒత్తిడి

- మద్యం దుకాణం వద్దే బార్ల మాదిరిగా పర్మిట్ రూమ్‌లు ఉన్నాయి. షాపులచుట్టూ పదుల సంఖ్యలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. అక్కడ తక్కువ ధరకే మద్యం అందుతుంది. ఒక బార్లకు వచ్చేది ఎవరు. పైగా నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తామనడం దారుణం. నాన్ రిఫండబుల్ నగదు కట్టి బారు సొంతం చేసుకున్నా తగినంత ఆదాయం ఉండదు. అందుకే బారు కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు.

-ఇదీ బార్లపై మద్యం వ్యాపారుల విముఖత

- జిల్లాలో బార్ల నిర్వహణపై వ్యాపారుల అనాసక్తి
- జిల్లాలో 19కి గాను తెరచుకున్నవి 9 మాత్రమే
- మిగిలిన పది బార్లకు అందని దరఖాస్తులు
- రీ నోటిఫికేషన్‌కు ఎక్సైజ్‌శాఖ సన్నద్ధం

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో బార్ల నిర్వహణపై మద్యం వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బార్లు అంటేనే.. తమకు వద్దు ఈ వ్యాపారం అని తేల్చేస్తున్నారు. దీంతో బార్ల దరఖాస్తుల కోసం ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, పలాస, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలతో పాటు ఎచ్చెర్లలో మొత్తంగా 19 బార్లకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఓపెన్ కేటగిరీలో 17, రిజర్వ్ కోటాలో రెండు బార్లకు దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించారు. కానీ మద్యం వ్యాపారులు పెద్దగా ముందుకు రాలేదు. ఇప్పటివరకు ఓపెన్ కేటగిరీలో ఏడు, రిజర్వ్ కేటగిరిలో రెండు బార్లు మాత్రమే తెరుచుకున్నాయి. ఆమదాలవలసలో ఒకటి, శ్రీకాకుళం నగరంలో ఆరు బార్లకు సంబంధించి లాటరీ పూర్తయింది. తెరుచుకున్నాయి. ఇంకా పలాస, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలసలో మిగతా పది బార్లకు దరఖాస్తులు రాలేదు. ఈ పది బార్లు ఓపెన్ చేయాలంటే దాదాపు 40 దరఖాస్తులు రావాలి. వాటి కోసం ఎక్సైజ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారన్నది బహిరంగ రహస్యం. అందుకే వ్యాపారులపై ఎక్సైజ్ అధికారులు ఒత్తిడి పెంచుతున్నా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ నెల 18తో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియగా.. మిగిలిన వాటికి రీ నోటిఫికేషన్‌కు ఇచ్చేందుకు ఎక్సైజ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

విముఖతకు కారణాలివే..

రాష్ట్ర ప్రభుత్వం బార్ పాలసీలో భాగంగా.. ఆగస్టు 26లోగా దరఖాస్తులు స్వీకరించి.. డిపాజిట్లు సైతం చెల్లించాలని చెప్పింది. అయితే గతంలో ఎన్నడూలేని (మిగతా 6వ పేజీలో..)

రేపటి నుంచి దసరా సెలవులు


పొందూరు : కేజీబీవీ నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు

పొందూరు/నరసన్నపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించింది. జిల్లాలో 2,955 ప్రభుత్వ పాఠశాలలు 476 ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది 1.80లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 21న ఆదివారం కావడంతో శనివారం మధ్యాహ్నం ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్వహించారు. మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించారు. దీంతో వసతిగృహాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులు శనివారం సాయంత్రం ఇళ్లకు తరలివెళ్లారు. కాగా పదోతరగతి విద్యార్థులకు సైతం ప్రత్యేక తరగతుల పేరిట దసరా సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు తప్పవని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. అక్టోబరు 3న పాఠశాలలు పునః ప్రారంభించాలని స్పష్టం చేసింది.


'ఫార్మర్ చార్ట్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు, సిబ్బంది

రైతుల కోసం ఫార్మర్ చార్ట్ యాప్

- జిల్లా ఉద్యానవన శాఖాధికారి వరప్రసాద్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు వినియోగపడేలా ఫార్మర్ చార్ట్ యాప్ సేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా ఉద్యానవన శాఖాధికారి రత్నాల వరప్రసాద్ తెలిపారు. శనివారం శ్రీకాకుళంలోని ఉద్యానవనశాఖ కార్యాలయంలో ఏడీ చంద్రశేఖరరావుతో కలిసి ఈ యాప్‌ను ఆవిష్కరించారు. రైతులకు సమయానికి అనుగుణంగా సూచనలు అందించేందుకు డిజిటల్ గ్రీన్‌ట్రస్టు, మైక్రోసాఫ్ట్ సంస్థలు సంయుక్తంగా ఫార్మర్ చార్ట్ యాప్‌ను అభివృద్ధి చేశాయి. దీనిద్వారా జిల్లాలో 3వేల మంది చిన్న, సన్నకారు రైతులకు సహాయం అందించనున్నాం. వాతావరణ మార్పులకు అనుగుణంగా, వివిధ వ్యవసాయ పద్ధతులను, లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తాం. ఇది ఏఐ ఆధారిత డిజిటల్ సహాయ వేదిక. రైతులు వాయిస్ మెసేజ్, టైపింగ్ లేదా పంటల ఫోటో ద్వారా సమాచారం పొందడం వీలవుతుంది. అధునాతన సాగు పద్ధతులు, వాతావరణ మార్పులు, మార్కెట్ సమాచారం తదితర వివరాలు లభిస్తాయి. రైతులు మంచి దిగుబడులు సాధించడానికి ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను రైతులు ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుని, సాంకేతికతను వినియోగించుకోవాల'ని వరప్రసాద్ కోరారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు జి.శ్రీకాంత్, డి.శేషఫణి, వైసీబీ సంస్థ సిబ్బంది, ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మతిమరుపు.. ముంచేస్తుంది

- 60 ఏళ్లు దాటితే తస్మాత్ జాగ్రత్త
- వ్యాధి ముదిరితే ఇక మంచంపైనే..
- నేడు ప్రపంచ అల్జీమర్స్ డే

6లో

కొత్తమ్మ జాతరకు సర్వం సిద్ధం

- భద్రతపై ప్రత్యేక దృష్టి
- భక్తుల సౌకర్యాలకు పెద్ద పీట
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మెచ్చుకోండి బాసూ

- నేడు భార్యను ప్రశంసించే రోజు


రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలకృష్ణ

వసప కేజీబీవీలో

10.5 క్వింటాళ్ల బియ్యం సీజ్

- రహస్య గదిలో నిల్వ
- దసరా సెలవుల్లో దారి మళ్లింపునకు ప్రణాళిక
- అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో వెలుగులోకి..

8లో


పెదగణగళ్లవానిపేట బీచ్‌ను శుభ్రం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ తదితరులు

బీచ్ పరిశుభ్రత మన బాధ్యత

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. బీచ్ పరిశుభ్రత.. మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. అంతర్జాతీయ తీరప్రాంత శుభ్రపరిచే దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీకాకుళం మండలం పెదగణగళ్లవానిపేట బీచ్‌ను కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే గొండు శంకర్, అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'పర్యాటకులు బీచ్‌లను శుభ్రంగా ఉంచాలి. చెత్త వేసేందుకు డస్ట్‌బిన్‌లు ఉపయోగించాలి. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా జిల్లాలో 912 గ్రామాల్లో 221 గ్రామాలను ఓడీఎఫ్ మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాం. అక్టోబరు 2 నుంచి శ్రీకాకుళం కార్పొరేషన్‌తో సహా అన్ని మున్సిపాలిటీలను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీగా మార్చనున్నాం. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే ప్లాస్టిక్ వినియోగించరాదని ఆదేశాలు జారీ చేశామ'ని తెలిపారు. ఎమ్మెల్యే (మిగతా 6వ పేజీలో..)

తాళాలు పగులగొట్టి..

బీరువాలు ఎత్తుకెళ్లి

- బంగారు, వెండి నగలు, నగదు అపహరణ
- ఇద్దరు దొంగలను అరెస్టు చేసిన పోలీసులు
- 574 గ్రా. బంగారం, 6.8 కేజీల వెండి, రూ.2.43 లక్షలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన బంగారు ఆభరణాల చోరీ కేసుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద 574 గ్రా. బంగారం, 6.8 కేజీల వెండి, రూ.2.43 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'ఆమదాలవలస ఎస్‌ఐ, సిబ్బందితో పార్వతీశునిపేట జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న కుప్పిలి రాజు అలియాస్ బ్లేడుగాడు, కుప్పిలి నరసింగరావు అలియాస్ చెంచుగాడు కనిపించారు. వారిద్దరినీ విచారించగా వారు 26 కేసుల్లో నిందితులుగా ఉన్నట్టు తేలింది. వీరు ప్రధానంగా నిద్రపోతున్న వ్యక్తుల మెడలో బంగారం అపహరిస్తారు. అలాగే ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి బీరువాల్లో బంగారం, వెండి వస్తువులు, డబ్బును దొంగిలిస్తూ చోరీలకు పాల్పడుతుంటారు. ఒక్కోసారి బీరువాను పట్టుకుని పోయి పొలాల్లోకి తీసుకెళ్లి తాళాలు విరగొట్టి అందులో ఉన్న వస్తువులను దొంగిలిస్తారు. వీరిద్దరికి (మిగతా 6వ పేజీలో..)


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి. పోలీసుల అదుపులో నిందితులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వందన

ఏమైందో..

- మేడపై నుంచి దూకిన ఇంటర్ విద్యార్థిని
- లోలుగు కేజీబీవీలో రాత్రివేళ ఘటన
- ప్రమాదమంటున్న పాఠశాల సిబ్బంది

పొందూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పొందూరు మండలం లోలుగు కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని పాఠశాల మేడపై నుంచి దూకింది. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా.. పాఠశాల సిబ్బంది ప్రమాదవశాత్తు జరిగిందని చెబుతున్నారు. ప్రిన్సిపాల్ మందలించడంతో ఆ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల లోలుగు కేజీబీవీలో గతంలో పనిచేసిన ప్రిన్సిపాల్ సౌమ్య తప్పుడు ఆరోపణలతో వివాదం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా విద్యార్థిని ఈ ఘటనకు పాల్పడడానికి కారణమేంటనేది చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. లోలుగు కాలనీకి చెందిన సీహెచ్ వందన పొందూరు మండలం లోలుగు కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో పాఠశాల రెండో అంతస్తు మేడపై నుంచి కిందకు దూకింది. విద్యార్థినులంతా ఆ సమయంలో నిద్రపోగా.. భారీ శబ్దం రావడంతో ఉలిక్కిపడి లేచారు. విద్యార్థినులు, పీఈటీ రూప వెళ్లి చూడగా.. వందన (మిగతా 6వ పేజీలో..)

మతిమరుపు.. ముంచేస్తుంది



- 60 ఏళ్లు దాటితే తస్మాత్ జాగ్రత్త
- వ్యాధి ముదిరితే ఇక మంచంపైనే..
- నేడు ప్రపంచ అల్జీమర్స్ డే



నరసన్నపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మనిషిలో మిగతా అవయవాలకు ప్రేరణ కల్పించేది నాడీమండలం. నాడీమండలం పనితీరు మెదడుపైనే ఆధారపడుతుంది. కాబట్టి మెదడును నిర్లక్ష్యం చేయకుండా నిత్యం చురుకుగా ఉంచే విధంగా తగిన చర్యలు తీసు కోవాలి. లేదంటే నిర్ణీత వయస్సు దాటిన తరు వాత మతిమరుపు ఖాయం అంటున్నారు వైద్యులు. మతిమరుపును నిర్లక్ష్యం చేస్తే ఎంతో ప్రమాదం. తగిన జాగ్రత్తలు తీసుకోక పోతే తీవ్ర వ్యాధిగా మారుతుంది. ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం. జ్ఞాపకశక్తి తగ్గిపోయి... తెలివి తగ్గి.. బంధువులు, స్నేహితులతో పాటు కుటుంబ సభ్యులను మరిచిపోయే స్థాయికి చేరుకోవడం మతిమరుపు వ్యాధి లక్షణం. దీనినే 'అల్జీమర్స్' అంటారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే వ్యాధిగ్రస్తుడు మంచానికే పరిమితమవుతాడు. 60 ఏళ్ల వయసు నుంచే మతిమరుపు ప్రారంభమై 80 ఏళ్లకు తీవ్ర దశకు చేరుతుంది. 1906లో ఆల్జీమర్స్ అనే జర్మనీ న్యూరో పైథాలజిస్ట్ ఈ వ్యాధిని కనుగొన్నాడు. ఆయన జ్ఞాపకార్థం ఏటా సెప్టెంబర్ 21న ప్రపంచ అల్జీమర్స్ డేగా ప్రకటించారు.

వ్యాధిలో దశలు..

- **ప్రారంభ దశ:** ఒకటి నుంచి రెండేళ్ల కాలంలో వృద్ధాప్యం వల్ల వచ్చే లక్షణాలు అంతగా కనిపించవు. మాట్లాడంలో ఇబ్బందులు, ప్రదేశాలు మర్చిపోవడం, మానసిక పరివర్తనలో మార్పులు, తమలో తామే మాట్లడుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ దశలో చిన్నపిల్లల్లా వ్యవహరిస్తారు.
- **మధ్య దశ:** రెండు నుంచి ఐదేళ్లలో వ్యాధి తీవ్రత పెరుగుతుంది. రోజువారీ పనులు చేసుకోలేకపోతారు. స్నాన, మల, మూత్ర విసర్జనకు కుటుంబ సభ్యులపై ఆధారపడతారు.
- **చివరి దశ:** ఐదేళ్ల నుంచి మతిమరుపు ఎక్కువగా ఉండటం. తినడానికి, నడవడానికి ఎక్కువ ఇబ్బంది పడతారు. మల, మూత్రాల గురించి కూడా తెలియకుండా మంచానికే అంకితం కావడం.

మతిమరుపునకు కారణాలు ఇవే..

- మద్యపానం
- పక్షవాతం
- మెదడు కేన్సర్, ఇన్‌ఫెక్షన్
- శరీరంలో విటమిన్ బీ12 తగ్గడం
- మందుల వల్ల వచ్చే దుష్పరిణామాలు
- థైరాయిడ్, మూత్రపిండాలు, కాలేయవ్యాధులు.

వ్యాధి వచ్చే అవకాశాలు ఇలా..

- 60 సంవత్సరాల పైబడటం
- వంశపారంపర్యం
- తలకు గాయం కావడం
- అధిక రక్తపోటు, అధిక కొవ్వుశాతం

విద్యార్థులు ఏం చేయాలంటే..

నేడు విద్యావిధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. పోటీతత్వం పెరిగింది. దీంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతూ మానసికంగా నలిగిపోతున్నారు. దీంతో మతిమరపునకు గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో 20వేల మందికిపైగా..

జిల్లాలో అల్జీమర్స్ వ్యాధిగ్రస్తులు 20వేలకు పైగా ఉన్నారు. 65 నుంచి 75 ఏళ్ల వయస్సులో ఉన్న వారిలో 10 శాతం, 85 ఏళ్లు దాటిన వారు 60 శాతం మేరకు ఈ వ్యాధికి గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో నివశించేవారే గురతున్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడించింది. ఈ వ్యాధిపై అవగాహన లేమి.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో న్యూరోసర్జన్‌లు లేకపోవడంతో వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు.

మతిమరుపు లక్షణాలు..

- మానసిక, శారీరక పరివర్తనలో మార్పు
- తెలిసిన పనులు చేయడంతో ఇబ్బందులు
- ప్రవర్తనలో మార్పు
- సమయం, పరిసరాలను చెప్పలేకపోవడం
- వారిలో వారే మాట్లాడుకోవడం.

ఇలా చేస్తే మంచిది..

- ఒకే విధానంపై దృష్టి పెట్టకుండా వివిధ విధానాలపై ఆలోచించగలగాలి.
- మెదడుకు పదును పెట్టే విధానాలను అలవరచుకోవాలి
- సరదా ఆటలు, పజిల్స్ వంటివి చేయాలి
- యోగా, శారీరక వ్యాయమం, ధ్యానం వంటివి ఎంతో ఉపయోగపడతాయి
- వృద్ధాప్యంలో కాకుండా విద్యార్థి దశ నుంచే వీటిని అలవరచుకోవాలి.

చికిత్స..

- ఈ వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స లేదు.
- మందులతో కొద్దిగా నయం చేయవచ్చు
- ప్రాథమిక దశలోనే వ్యాధి నిర్ధారణ చేయగలగాలి.
- తీసుకోవాల్సిన జాగ్రత్తలు రోగితో పాటు కుటుంబ సభ్యులకు వైద్యులు వివరించాలి.

నిర్లక్ష్యం చేయకూడదు..



ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేయరాదు. ఎప్పటికప్పుడు వైద్యులను కలసి చికిత్స చేయించుకోవాలి. లేదంటే పరిస్థితి విషమించే అవకాశం ఉంది. మందుల కంటే కుటుంబ సభ్యుల సహకారం అవసరం.

-తండ్యాల నరేష్, న్యూరాలజిస్టు, శ్రీకాకుళం

జాగ్రత్తగా చూసుకోవాలి..



మతిమరుపు వ్యాధిగ్రస్తులను జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే నయం చేసే వీలుంటుంది. నివారణకు మందులు ఉండవు కాబట్టి కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలి.

-డా.పొన్నాడ గణేష్, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి, కోటబొమ్మాళి

శరన్నవరాత్రులకు వారాహి అమ్మవారు ముస్తాబు

- శ్రీముఖలింగంలో రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

జలుమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీ శ్రీముఖలింగేశ్వరాలయంలో కొలువుదీరిన వారాహి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చేనెల 2తో ముగుస్తాయి. ఉత్సవాల ప్రారంభం నుంచి వారాహి అమ్మవారు రోజుకొక రూపంలో పూజలందుకుంటారు. 22న మొదటి రోజు సోమవారం బాలత్రిపుర సుందరి రూపంలోను, 23నగాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా పూజలందుకుంటారు. 25న వారాహి అమ్మవారి రూపంలోను, 26న మహాలక్ష్మిగా, 27న లలిత త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిస్తారు. 28న పార్వతీదేవిగా 29న సరస్వతీదేవిగా 30న దుర్గాదేవిగా, అక్టోబరు 1న మహిషాసుర మర్దిని గా 2న రాజరాజేశ్వరిగా పూజలు అందుకుంటారని అర్చకుల సంఘ అధ్యక్షులు వెంకటాచలం తెలిపారు. అమ్మవారిని రోజుకొక రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. దసరా ఉత్సవాలు పురస్కరించుకొని శ్రీముఖలింగేశ్వరాలయాన్ని అర్చకులు, దేవదాయ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



వారాహి అమ్మవారు

తాళాలు పగులగొట్టి.. బీరువాలు ఎత్తుకెళ్లి

(ఐదో పేజీ తరువాయి)

సంతకవిటి పోలీస్‌స్టేషన్ పరిధిలో సస్పెక్ట్ షీట్‌లు కూడా ఉన్నాయి. ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, జలుమూరు, పొందూరు, శ్రీకాకుళం టూటౌన్, పాతపట్నం, కోటబొమ్మాళి ప్రాంతాల్లో జరిగిన దొంగతనాల కేసుల్లో కూడా నిందితులుగా ఉన్నారు. ఆరేడు నెలలుగా వారి కోసం గాలిస్తున్నాం. వారిని అరెస్టు చేస్తే బ్లేడుతో గొంతుకోసుకుని మరణిస్తామని కుటుంబ సభ్యులు బెదిరిస్తుంటారు. డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. వారిని అరెస్టు చేశాం. మొత్తం 618 గ్రాముల బంగారానికిగాను 574 గ్రాములను, ఏడు కేజీల వెండికిగాను 6.8 కేజీలను, రూ.3.7 లక్షలకుగానూ రూ.2.34 లక్షల నగదును రికవరీ చేశామ'ని ఎస్పీ తెలిపారు.

ప్రజాప్రతినిధులూ.. సమస్యలపై చర్చించరూ!

(ఐదో పేజీ తరువాయి)

దుకాణాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించాలి.

- వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల పేరిట అక్రమాలు చోటుచేసుకున్నాయి. శ్రీకాకుళంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో కొంతమందికి ఇచ్చిన స్థలాలు కొండలు, గుట్టలులో ఉన్నాయి. వాటి జోలికి లబ్ధిదారులు వెళ్లలేదు. కానీ ఆ స్థలాలను చదును చేసినట్లు చూపించి నిధులు కాజేశారు. వీటిపై చర్చ జరగాలి.
- జల్‌జీవన్ మిషన్ పనుల పేరిట గత ప్రభుత్వం నాన్చుడు వ్యవహారం చేసింది. కూటమి ప్రభుత్వం ఈ పనుల గడువును పెంచింది. కానీ ఏ మండలంలోనూ పూర్తిస్థాయిలో పనులు నిర్వహించలేదు. పట్టణాల్లో పైపులైన్ల కోసం రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేశారు. యాభైశాతం కూడా ఇంటింటికీ తాగునీరు ఇచ్చే పరిస్థితి ఇప్పటికీ కల్పించలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలి.
- శ్రీకాకుళంలో కోడిరామ్మూర్తి స్టేడియం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీనిపై చర్చించి ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టత నివ్వాలి.
- కొత్తూరు, హిరమండలం, శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. జిల్లాలో పలుప్రాంతాల్లో సాగునీటి చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. దీనిపై కూలంకుషంగా చర్చించాలి.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కొత్తమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధం

- భద్రతపై ప్రత్యేక దృష్టి
- భక్తుల సౌకర్యాలకు పెద్ద పీట
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండల కేంద్రంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే జరిగే కొత్తమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరను అంగరంగ వైభవంగా జరిగేలా... ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతరలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా మని, సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి వాహనాలకు ప్రత్యేక పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయన్నారు. ఉచిత దర్శనం క్యూలైన్లు, నాణ్యమైన ప్రసాదం, ప్రత్యేక దర్శన టిక్కెట్లపై సూచనలు చేశారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వరకు రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, సెంటర్ డివైడర్ల అలంకరణ, విద్యుద్దీపాలు అమర్చినట్లు తెలిపారు. బయో టాయిలెట్లు, ఆర్టీసీ బస్సులు, వైద్య శిబిరాలు, అన్నదానం, మజ్జిగ పంపిణీ, శోభాయాత్ర వంటి ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, మెప్మా పీడీ సుధాకర్, డీపీఓ భారతీ సౌజన్య, మున్సిపల్ ఈఈ సుగుణాకర రావు, డీఎంహెచ్‌వో మేరీ క్యాథరిన్ తదితరులు పాల్గొన్నారు.

మెచ్చుకోండి బాసూ



- కుటుంబ మనుగడలో కీలకం భార్య
- నేడు భార్యను ప్రశంసించే రోజు

నరసన్నపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

భార్య.. కుటుంబంలో కీలకమైన పాత్ర ఆమెది. సంపాదించేది భర్తే అయినా.. కుటుంబాన్ని సమన్వయం చేసేది భార్య. కుటుంబ జీవనం సవ్యంగా సాగడం భార్య పైనే ఆధారపడి ఉంటుంది. ఎక్కువ మంది ఉద్యోగులు.. అధికారులు... నేతలు విధి నిర్వహణలో స్వేచ్ఛగా వ్యవహరిస్తుంటారంటే.. దాని వెనుక కుటుంబ బాధ్యతలు మోసే భార్య పాత్ర కీలకం. భార్యలు ఏదీ ఆశించరు కానీ.. భర్తల నుంచి వచ్చే ప్రశంసలను మధురానుభూతిగా భావిస్తుంటారు.

ఆమె పాత్ర కీలకం..

కాలంతో పాటు సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా.. కుటుంబంలో మాత్రం 'ఆమె' పాత్ర మాత్రం మరువరానిది. భార్య... ఇంట్లో తల్లిగా.. కోడలిగా.. అత్తగా... అమ్మమ్మగా... నాన్నమ్మగా... ఇలా బహు పాత్రలు పోషించి... అలసిపోతుంటుంది. ఈ పాత్రలను సమర్థంగా పోషించే క్రమంలో భర్త నుంచి వచ్చే చిన్న ప్రశంస చాలు...మొత్తం అలసట నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు... కుటుంబ నావను సవ్య దిశగా నడిపేందుకు ప్రశంస ఇంధనంగానూ ఉపయోగపడుతుంది.

గొప్ప అనుభూతి..

భార్యను ప్రశంసించడం అనేది కూడా ఒక ప్రత్యేక విద్య అంటారు చాలామంది. కేవలం భార్యను ప్రశంసించడమే కాదు. వారి బలహీనతలను... సమస్యలను గుర్తెరగాలి. వాటికి పరిష్కారం చూపాలే కానీ.. వారిపై చిరాకు పడకూడదు. వారిని విమర్శించి.. దూషించకూడదు. మనస్తాపానికి గురయ్యేలా చేయకూడదు. ఎలా ఉన్నా ప్రేమించడం మాత్రం మానకూడదు. వారెలా ఉన్నారో అలానే స్వీకరించాలి. నువ్వు నాకు నచ్చినట్టు ఉంటేనే ప్రేమిస్తా.. లేకుంటే మాత్రం లేదు అనేలా వ్యవహరించకూడదు. అలా వ్యవహరిస్తే.. ఆ బంధం ఎక్కువ కాలం నిలవదు కూడా.

అవమానించకూడదు..

జీవిత భాగస్వామిని అనుమానిస్తే అవమానించినట్టే. ఆ అనుమానమే బంధాన్ని బలహీనపరుస్తుంది. భార్య స్వేచ్ఛకు ఎట్టి పరిస్థితుల్లో భంగం కలిగించకూడదు. చిన్న చిన్న విషయాల్లోనూ ప్రవేశించి.. అడగకుండానే సలహా ఇవ్వడం.. సరైన రీతిలో ఆలోచించడం లేదని విమర్శించడం.. తనకంటే తక్కువగా భావించడం, వంటివి బంధాలను దెబ్బతీస్తాయి. భాగస్వామికి భావస్వేచ్ఛ ఇవ్వడం చాలా ఉత్తమం.

పేరుకు తగినట్టే.. సుగుణ



నా భార్య సుగుణను పెళ్లి చేసుకునేందుకు అప్పట్లో మూడేళ్లు వేచి ఉన్నాను. బంధువుల ఇంటిలో శుభ కార్యక్రమానికి వెళ్లి.. సుగుణను చూసి ఏరికోరి పెళ్లి చేసుకున్నాను. పెళ్లి నాటి నుంచి ఇప్పటి వరకు ఎంతో ఇష్టంగా.. అన్యోన్యంగా ఉంటున్నాం. పేరుకు తగినట్టే ఆమె 'సుగుణ' వంతురాలు. 1984 మార్చి 9న మా వివాహమైంది. రాజకీయాల్లోకి రాకముందు కుటుంబ వ్యవహారాల్లో కూడా నేను ఏపని చేసినా.. నా ఆనందాన్ని తన ఆనందంగా భావించేది. నా భార్య చేతి వంట తినడం నాకెంతో సంతోషాన్నిస్తుంది. అందుకే రాజకీయాల్లోకి వచ్చిన తరువాత కూడా కారులో క్యారేజ్ ఉంటుంది. సుగుణ చేసిన ఉప్మా అంటే నాకు ఇష్టం. అందుకే ఆమెను ప్రతి విషయంలో ప్రశంసిస్తుంటా. ఏటా మా పెళ్లి రోజు తప్పకుండా అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకుని.. సినిమాకు వెళతాం.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

బార్లు మాకొద్దు

(ఐదో పేజీ తరువాయి)

విధంగా ఈసారి బార్ పాలసీ ఉంది. మద్యం దుకాణాల మాదిరిగానే లాటరీ తీస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే ఇక్కడ ఒక మెలిక పెట్టింది. ఒక్కో బారుకు నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ తీస్తామని చెప్పడంతో వ్యాపారులు వెనక్కి తగ్గారు. దరఖాస్తు రుసుం కింద సుమారు రూ.5.10లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఇది నాన్ రిఫండబుల్. ఈ విషయంలో ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా నాలుగు దరఖాస్తులు రాకపోతే లాటరీ తీయకపోగా రూ.5.10 లక్షలు తిరిగి ఇవ్వరట. ఈ కారణంగానే ఎక్కువ మంది బార్ల దరఖాస్తుకు ఆసక్తి చూపడం లేదు. ఏడాదికి రూ.55 లక్షల వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అంటే దానికి మించి ఆదాయం వస్తే కదా బార్లు నడిపేది. అందుకే మద్యం దుకాణాల్లో ఎదురైన పరిణామాల దృష్ట్యా ఎక్కువ మంది విముఖత చూపుతున్నారని తెలిసింది. అందుకే బార్ పాలసీ విషయంలో ప్రభుత్వం పునఃసమీక్షించుకోవాలని, 2014 నుంచి 2019 మధ్య ఉన్న బారు పాలసీని పునరుద్ధరించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

నిబంధనల ప్రకారమే..



జిల్లాలో ఇప్పటివరకు ఏడు బార్లు తెరుచుకున్నాయి. రిజర్వ్ బార్లు రెండు సైతం ప్రారంభమయ్యాయి. మిగతా పది బార్లుకు సంబంధించి రీ నోటిఫికేషన్ ఇస్తాం. దరఖాస్తులు వచ్చిన వెంటనే లాటరీ తీసి కేటాయిస్తాం. నిబంధనల మేరకు ప్రక్రియను పూర్తిచేస్తాం. ఈ విషయంలో ఎవరిపై కూడా ఒత్తిడి చేయడం లేదు. ఆసక్తి ఉన్నవారు బార్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలి.

-రామచంద్రరావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఏసీ, శ్రీకాకుళం

బీచ్ పరిశుభ్రత మన బాధ్యత

(ఐదో పేజీ తరువాయి)

గొండు శంకర్ మాట్లాడుతూ.. 'వ్యర్థాలను నేరుగా సముద్రంలో విడిచి పెట్టడం ద్వారా నీరు కలుషితమై మత్స్య సంపద నాశనం అవుతుంది. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలి. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత' అని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ, డీపీవో కె.భారతి సౌజన్య, తహసీల్దార్ గణపతిరావు, ఎంపీడీవో ప్రకాశరావు, సర్పంచ్ బర్రి రామారావు, ఎంపీటీసీ చీకటి అమ్మోజీరావు, యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు, వివధ కంపెనీల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'స్వచ్ఛతాహి సేవ', 'ప్లాస్టిక్ వద్దు - కాటన్ ముద్దు' అనే నినాదాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఏమైందో..

(ఐదో పేజీ తరువాయి)

తీవ్ర గాయాలతో కనిపించింది. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి సూచన మేరకు విద్యార్థినిని ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వడంలో వారూ ఆస్పత్రికి చేరుకున్నారు. వందన ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా.. విద్యార్థినికి కుటుంబ, వ్యక్తిగత సమస్యలు లేవని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చెబుతున్నారు. పాఠశాల సిబ్బంది మాత్రం ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందని పేర్కొంటున్నారు. అర్ధరాత్రి సమయంలో మేడమీదకు వెళ్లాల్సిన అవసరం విద్యార్థినికి లేదని, ఇది ఆత్మహత్యాయత్నమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత విషయాలపై ప్రిన్సిపాల్ సున్నితంగా మందలించారని.. అందుకే ఆత్మహత్యాయత్నం చేసుకుందని ఆరోపణలున్నాయి. దసరా సెలవుల ముందురోజు ఈ ఘటన జరగడంతో తోటి విద్యార్థినులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కాగా సమాచారం తెలుసుకుని ఎంఈవో-1 వాగ్దేవి శనివారం శ్రీకాకుళంలో రిమ్స్‌కు వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. ఘటనపై ఆరాతీసి పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పొందూరు ఎస్సై వి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రత నిరంతర ప్రక్రియ

- ఇది అందరి బాధ్యత
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రిమ్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత అనేది ఒక నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులతో కలిసి కళాశాల, జీజీహెచ్ ఆవరణలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆలోచనలు, వ్యవహార శైలిలో మార్పు రావాలని.. అప్పుడే స్వచ్ఛత అనేది సాధ్యపడుతుందన్నారు. ఒక రోజు పరిశుభ్రం చేస్తే సరికాదని..దీన్ని ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. క్యాంపస్ పరిశుభ్రత అందరి బాధ్యత అని వైద్య విద్యార్థులతో చర్చా కార్యాక్రమంలో కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి... ఆరు నెలలు దానిని సంరక్షించాలని కోరారు. క్యాంపస్‌లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, హాస్టల్‌లో లెగ్ ఆపరేటెడ్ డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేయాలని, లోపల ఇంటర్నెట్ రావడం లేదని విద్యార్థులు కలెక్టర్‌కు వివరించగా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మెడికల్ కాలేజీ ఆవరణలో కలియదిరుగుతూ డ్రైనేజీ, శానిటేషన్ తదితరాలను పరిశీలించారు. బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. క్యాంపస్ పరిశుభ్రతను కాపాడడంలో విద్యార్థులు, సిబ్బంది ముందడుగు వేస్తేనే స్వచ్ఛత కార్యక్రమం విజయవంతమవుతుందని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.అప్పలనాయుడు, ఆర్ఎంఓ డా.సుభాషిణి, జేడీ రాజశేఖరరెడ్డి, ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెరిగేందుకే 'మ్యాజిక్ డ్రైన్‌లు'



మ్యాజిక్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకర్

జి.సిగడాం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంపొందిం చేందుకు మ్యాజిక్ డ్రైన్‌లు దోహదపడతా యని డ్వామా పీడీ సుధాకర్ అన్నారు. మెట్టవలసలో మ్యాజిక్ డ్రైన్ పనులను శనివారం పరిశీలించారు. నాలుగు వందల మీటర్ల పొడవునా సుమారు రూ.3.50 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఏ సీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, కామోజుల సీతారాం, ఏపీవో సీహెచ్ సత్యనారాయణ, ఈసీ పురుషోత్తమరావు, పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమారి తదితరులు ఉన్నారు.

రిక్కా రాముడికి గ్లోబల్ పీస్ అవార్డు



రిక్కా రాముడికి సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

గార రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గార మండలం వమర వల్లి పంచాయతీ గొర్లెవానిపేటకు చెందిన రిక్కా రాముడికి గ్లోబల్ పీస్ ఐకాన్ అవార్డు వచ్చింది. కొరియాకు చెందిన గ్లోబల్ పీస్ కల్చరల్ అసోసియేషన్ వారు ఇంటర్నేషనల్ పీస్ డే సందర్భంగా శనివారం విశాఖపట్నంలో సమ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 15 విభాగాల్లో రచనలను ఎంపిక చేశారు. వీటిలో స్ఫూర్తిదాయకమైన కవితలు రాసిన రాముడికి ఈ అవార్డును అందజేశారు. ఈ మేరకు కొరియాకు చెందిన ఇంటర్నేషనల్ మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ మెతావ్ హంగ్, అసోసియేషన్ హోస్టర్ అధాని రాజా యోనాహ్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు.

విద్యార్థినుల శ్రమదానం



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థినులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలికల జూనియర్ కళాశాలలో శని వారం జాతీయ సేవా పథకం వలంటీర్లు శ్రమదానం చేశారు. ఎన్ఎస్ఎస్ పీవో రజనికుమారి ఆధ్వర్యంలో కళాశాల మైదానం లోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకుడు పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత 'గురజాడ'

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాడుకభాషకు పట్టంకట్టి తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడి సృష్టించిన మహనీయుడు గురజాడ అప్పారావు అని వక్తలు అన్నారు. ఈ మేరకు శని వారం గుర జాడ అప్పారావు జయంతిని స్థానిక విద్యాధరి డిగ్రీ కళాశాల, మునసబు పేట గాయత్రి కాలేజీలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బాల్య వివాహాల వంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా తన కలం ద్వారా చైతన్యపూరిత రచనలు చేసిన మహోన్నత వ్యక్తి గురజాడ అని కొనియాడారు. ఆయన రచన లను స్ఫూర్తిగా తీసుకుని సమస్యలపై పోరాటం చేయాలని వక్తలు కోరా రు. కార్యక్రమాల్లో సీనియర్ పాత్రికేయుడు జంధ్యాల శరత్‌బాబు, కేవీవీ సత్యన్నారాయణ, జేసీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు జామి భీమ శంకరరావు, ప్రతినిధులు తమ్మినేని ఉషారాణి, జగదీష్, పోషక్ కుమార్, సురేంద్ర, రచయితలు భమిడిపాటి గౌరీశంకర్, అప్పల నాయుడు, గోపాలరావు, ధన్వంతరి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు జారీ చేయాలి

ఆమదాలవలస, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వి శ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డుల ను సత్వరం జారీ చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదరి సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయం ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య పథ కం కార్డులు జారీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఆరోగ్య సేవలు అందక 2025 జూలై, ఆగస్టు నెలల్లో అనేక మంది మరణించిన సంఘటనలున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హెల్త్ కార్డు లను అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి హెచ్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు లక్ష్మంనాయుడు



లక్ష్మంనాయుడును అభినందిస్తున్న క్యాంపస్ డైరెక్టర్ తదతరులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంప స్‌లో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ రెడ్డి లక్ష్మం నాయుడు జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. ఈనెల 14న విశాఖలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ ఏడాది డిసెంబరు 14, 15వ తేదీల్లో ఛండీఘడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా రన్నారు. ఈ సందర్భంగా ఆయనను డైరెక్టర్ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ అభినందించారు.

డ్రోన్ సాయంతో సాగు లాభదాయకం

లావేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డ్రోన్‌ల సాయంతో వ్యవసాయం చేయడం లాభదాయకమని డ్రోన్ మాస్టర్ ట్రైనీ కంబపు కృష్ణ అన్నారు. శనివారం బెజ్జిపురంలో రైతులకు డ్రోన్ పరికరం ద్వారా ఎరువులు పిచికారీ విధానాన్ని వివరిం చారు. రైతులు అన్ని పనులకు కూలీలపై ఆధారపడడం వల్ల వ్యయంతో పాటు సమయం వృథా అవుతోందని, డ్రోన్ సాయంతో వీటన్నింటినీ అధి గమించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యద ర్శులు శివకృష్ణ, డి.గాయత్రి, కె.సత్యవతి, పి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీయే సరైన మార్గం

ఆమదాలవలస, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజీయే సరైన మార్గ మని మధ్యవర్తిత్వ న్యాయవాది కణితి విజయ లక్ష్మీభాయ్ అన్నారు. శని వారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో కక్షిదారుల మధ్య ఉన్న కేసుల మధ్యవర్తిత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివాదాలకు రాజీయే శాశ్వత మార్గమన్నారు. దీర్ఘకాలం పాటు కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం వృథా చేసుకో వద్దన్నారు. కక్షిదారులు కోర్టులపై ఆధారపడకుండా చర్చల ద్వారా తగా దాలను పరిష్కరించుకోవడం వల్ల న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్ర మంలో న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, వాడవలస రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు తీసుకోండి

● మహిళల భద్రత, పిల్లల రక్షణకు ప్రాధాన్యమివ్వాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐ లు, ఎస్‌ఐలతో కేసుల దర్యాప్తు, పురోగతి, ముద్దాయిల అరెస్టు తదితర అంశాలపై నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన గ్రేవ్ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులపై దృష్టి సారించి వేగవంతం చేసి దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. మహిళల భద్రత, పిల్లల రక్షణ, ఈవ్‌టీజింగ్, పోక్సో కేసులు, బాల్య వివాహాలు, సామాజిక మాధ్యమాల నేరా లపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల న్నారు. గంజాయి నియంత్రణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, గంజాయి కేసుల్లో అరెస్టయిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. వాహనాల తనిఖీ చేస్తూ జిల్లాలో పూర్తి స్థాయిలో అక్రమ రవాణాను అరిక ట్టాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేయాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌పై దృష్టి కేంద్రీకరించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ విచారణ చేసి బాధితులకు చట్టపరిధిలో న్యాయం చేకూర్చాల న్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది తప్పనిస రిగా గ్రామ సందర్శన చేయాలని, ప్రజలతో మమేకమై గ్రామాల్లోని సమస్యలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించి ప్రాథమిక స్థాయిలో ఉన్న వారిని ముందస్తుగా బైండోవర్ చేయా లన్నారు. సమావేశంలో ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీని వాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



హైకోర్టు న్యాయమూర్తికి పూలమొక్క అందిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పోర్టు ఫోలియో హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ నత్తి సుబ్బారెడ్డి శ్రీకాకుళం వచ్చిన సందర్భంగా పోలీసు అతిథి గృహంలో శనివారం ఎస్పీ మహే శ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి ని జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా గతంలో ఇచ్చిన రిప్రజెంటేషన్‌కు స్పందించి జిల్లా కోర్టు ప్రాంగణంలోని పలు కోర్టులకు న్యాయమూర్తుల నియామ కం, కోర్టు ప్రాంగణంలోని సమస్యలను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్ట దామోదర రావు, సీనియర్ న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, వాన కృష్ణచంద్, ఎన్ని సూర్యారావు, మామిడి క్రాంతి, జి.భాగ్యలక్ష్మి, భవానీ ప్రసాద్ తదితరులున్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి ఎంపీపీ పాఠశాలలో గతంలో ఏర్పాటు చేసి పాడైన సరస్వతి దేవి, వినాయక విగ్రహా లకు మరమ్మతులు చేసి శనివారం తిరిగి ఆవిష్క రించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఆనంద్ తన సొంత డబ్బులు వెచ్చించి విగ్రహాలను బాగు చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

ఆమదాలవలస, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్ సత్యసాయి భజన మండ లి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత వసంతాల వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా దివ్యాంగుడైన ఫకీర్ సాహెబ్‌పేటకి చెందిన బి.ప్రవీణ్‌కుమార్‌కు వీల్‌చైర్‌ను అందిం చారు. కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఇన్‌చార్జి పి.తాతయ్య, జోనల్ కన్వీనర్ రవీంద్రబాబు, స్టేట్ విద్యాజ్యోతి ఇన్‌చార్జి ఎస్.గురు ప్రసాద్, యూత్ కో-ఆర్డినేటర్ దామోదర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించా మని, ఎవరైనా వాడితే చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకట నలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పట్టణ పరిధిలో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ (సింగి ల్‌యూజ్ ప్లాస్టిక్)ను పూర్తిస్థాయిలో నిషేధించా మన్నారు. ప్రజలు, వ్యాపారులు గమనించి సింగి ల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర వస్తువులను వినియోగించాలని సూచించారు.

4, 5 తేదీల్లో సీఐటీయూ మహాసభలు

సోంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోం పేటలో అక్టోబరు 4, 5 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీ యూ జిల్లా 12వ మహాసభలను విజయ వంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు కోరారు. ఈ మేరకు పట్టణంలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.లక్ష్మీనాయుడు, ఎన్. గణపతి, కన్వీనర్ పి.చిరంజీవి పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దశరా నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుండి అక్టోబరు ఒకటి వరకు నిర్వహించను న్నారు. ఈ ఉత్సవాలు 10 రోజుల పాటు జరుగు తాయని, పది రోజులు అమ్మవారు వివిధ అవతా రాల్లో భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రతీరోజూ విశేష పూజలు, సామూ హిక కుంకుమార్చనలు, నిర్వహిస్తున్నామన్నారు.

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి

గార రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యా శిక్షణా సంస్థ సీనియర్ లెక్చరర్ కె.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకూర్మం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొ న్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు.

నేడు ఛాయారాజ్ వర్ధంతి సభ

గుజరాతీపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, జనసాహితి రాష్ట్ర అధ్యక్షు డిగా సేవలందించిన కొంక్యాన ఛాయారాజ్ 13వ వర్ధంతిని ఆదివారం నిర్వహిస్తున్నట్లు జనసాహితి జిల్లా కార్యదర్శి పి.మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయం పది గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతుందన్నారు.

ప్రతీ ఒక్కరూ అక్షరాస్యులు కావాలి

● వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు

జి.సిగడాం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు అన్నారు. 'అక్షర ఆంధ్ర'లో భాగంగా మండల కేంద్రంలో నిర్వ హిస్తున్న మండలస్థాయి ఉల్లాస్ శిక్షణ తరగతులను శని వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. నిరక్షరాస్యులైన మహిళలంతా అక్షరాస్యులు కావడమే ఉల్లాస్ లక్ష్యమన్నారు. ఈ దిశగా స్వచ్ఛంద వలంటీర్లు పనిచే యాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్, ఏపీడీ హరిత, జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఎంఈవో ముక్క శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసానికి చదువు దోహదం

ఆమదాలవలస, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో ఆత్మవిశ్వాసం కలిగేందుకు చదువు దోహ దపడుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ బి.రమేష్, మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం, సీవోలు నాగ మణి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అందరి మనసుల్లో బాలుకి చిరస్థానం



బాలు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలు పాటలు ఎన్నటికీ చిరస్మరణీయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు అన్నారు. ఈనెల 25న ఎస్పీ బాలసుబ్ర హ్మణ్యం వర్ధంతి సందర్భంగా శనివారం ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని స్వరాత్మిక సంగీత విద్యాపీఠం ఆధ్వర్యం లో స్థానిక బాపూజీ కళామందిరంలో నిర్వహించారు. బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలు అనేక చిత్రాల్లో పసం దైన గీతాలను ఆలపించి అందరి మనసులను దోచుకున్నార న్నారు. ఆయన పాటలతో ఎందరో గాయనీ గాయకులు శిక్షణ పొంది ఆలపిస్తున్నారన్నారు. అనంతరం కేఎల్ఎన్ మూర్తి, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, మంగవేణి తదిత రులు బాలు పాటలను ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవ స్థాపకుడు కేవీ ఉమా మహేశ్వరరావు, సంగీత విద్యాపీఠం నిర్వాహకుడు సుసరాపు లక్ష్మీ గణపతి శర్మ, నిక్కు అప్పన్న, ముద్దాడ అప్పలనాయుడు, మిమిక్రీ కళాకారుడు నందికేశ్వర రావు, బాలయ్య పంతులు, మావుడూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రొయ్యల చెరువులకు విద్యుత్ నిలిపివేత



విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకా కుళం రూరల్ మండలం పెద్ద గణగళ్లవానిపేటలో అక్రమం గా నిర్వహిస్తున్న రొయ్యల చెరువులకు విద్యుత్‌ను శనివారం నిలుపుదల చేశారు. ఈ చెరువుల నుంచి వచ్చే వర్థాలతో గ్రామస్థులు అనారోగ్యం పాలవుతున్నారని శనివారం స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి స్థానికులు తీసుకు వెళ్లారు. దీంతో వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి తక్షణం విద్యుత్ నిలుపుదల చేయాలని వారు ఆదేశించారు. రొయ్యల ట్యాంకులను తొలగించాలని సంబంధిత అధికా రులకు సూచించారు. సమస్యపై తక్షణం స్పందించిన కలెక్టర్, ఎమ్మెల్యేలకుస్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు



శాంపిళ్లను సేకరిస్తున్న సిబ్బంది

గార, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వమర వల్లి పరిధి లోని రొయ్యల చెరువులు, రొయ్యల హేచరీల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలను శనివారం నిర్వహించారు. కాకి నాడలోని రాష్ట్ర మత్స్య, సాంకేతిక శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో సాంకేతిక సిబ్బంది శ్యాంపిళ్లను సేకరించారని, వివిధ పరీక్షలు చేసి రైతులకు ఆ ఫలితాలను తెలియ జేస్తారని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు బి.సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్ర మంలో మత్స్య సహాయకులు హేమ సుందర్, ఆక్వా ల్యాబ్ ఇన్‌చార్జి డాక్టర్ పి.వెంకటబాబు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ కార్డులు అప్పగించండి

● డీలర్లకు తహసీల్దార్ అప్పలస్వామి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోంపేట రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మర ణించిన వ్యక్తుల పేర్లతో ఏళ్ల తరబడి ఉన్న రేషన్ కార్డులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పేర్ల తో ఉన్న బోగస్ కార్డులను స్వచ్ఛందంగా అప్పగించాలని, దీనికి డీలర్లు బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ అప్పల స్వామి ఆదేశించారు. ఈనెల 14న 'ఆంధ్రజ్యోతి'లో 'మృతుల పేరున సరుకులు లక్ష్యానికి తూట్లు' శీర్షికతో వచ్చిన కథనా నికి పౌర సరఫ రాలశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం డీలర్లతో తహసీ ల్దార్ అప్పలస్వామి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డు ప్రక్షాళనకు డీలర్లు సహకరించాలని ఆయన కోరా రు. ప్రభుత్వం కార్డుదారులకు అంది స్తున్న రేషన్ బియ్యం వ్యాపారు లకు అమ్మి నట్టు రుజువైతే ఆ కార్డులు రద్దు చేస్తామని హెచ్చరిం చారు. అనంతరం మండలంలో ఉన్న 55 రేషన్ డిపోల్లోని సుమారు 150 మృతుల పేర్లతో ఉన్న రేషన్ కార్డులను కార్యాల యానికి అప్పగించారు. సీఎస్‌డీటీ కూర్మారావు, డీలర్ల సంఘం అధ్యక్షుడు షన్ముఖరావు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో మహా లింగార్చన



మహాలింగార్చన చేస్తున్న అర్చకులు

అరసవల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత సూర్య నారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో శనివారం శివ పంచా యతన సహిత మహా లింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చ కులు ఇప్పిలి శంకర శర్మ, అర్చకులు ఇప్పిలి సాందీప శర్మ, దర్భముళ్ల శ్రీనివాస శర్మ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ పూజలు



విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

సోంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విరాట్ విశ్వకర్మ పూజలు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా వివిధ వేషధారణలతో కళాకారులు ప్రదర్శనలి చ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆమదాలవలస పట్టణంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం వద్ద మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు పోటీలు

లావేరు, సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): మురపాక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ స్కూల్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్‌లో భాగం గా శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బ్యాంకు సేవల ను మేనేజర్ బి.సత్యనారాయణ వివరిం చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభా కరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

పొందూరు, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశా లకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సుమారు రూ.25 వేలు విలువ చేసే 10 ఫ్యాన్లను హెచ్‌ఎం వాగ్దేవికి శనివారం అంద జేశారు. కొన్ని తరగతి గదులకు ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని వీటిని అందించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఎర్రా మల్లిబాబు, ఎర్రా సతీష్, పి.దివాకర్, సూర్యనారాయణ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో 'వావిలపల్లి'కి అవకాశం



పొందూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన రచయిత, రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీతవావిలపల్లి రాజారావుకు అరు దైన గౌరవం దక్కింది. తిరుమల తిరు పతి దేవస్థానం నిర్వహిస్తున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 'భక్తి సందేశం'లో ప్రసం గించేందుకు రాజారావుకు ఆహ్వా నం అందింది. ఈనెల 30న తిరుమల ఆస్థాన మండపంలో ఉదయం 11.30 నుంచి 12.30 వరకు అన్నమయ్య కీర్తనలపై ప్రసంగించాలని టీటీడీ నుంచి ఆహ్వానం వచ్చినట్లు రాజారావు తెలిపారు.

తీరాలను పరిశుభ్రంగా ఉంచాలి

రణస్థలం, సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): సేవా పక్షోత్సవాల్లో భాగంగా 'స్వచ్ఛ సాగర్-సురక్ష సాగర్' శనివారం కొవ్వాడ, జీరుపాలేం, అల్లివలస, మెం టాడ తీరాల్లో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా సముద్ర తీరాల్లోని చెత్తను తొలగించారు. మత్స్యకారులు తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కె.కుమార్, మత్స్యశాఖ ఉప సంచాలకుడు వై.సత్య నారాయణ, ఎఫ్‌డీవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో..

కవిటి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తపాలెం సముద్ర తీరంలో మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం 'స్వచ్ఛసాగర్- సురక్ష సాగర్' కార్యక్రమం చేపట్టారు. సముద్రతీరంలో పేరుకు పోయిన చెత్తలను తొలగించి శుభ్రపరి చారు. కార్యక్రమంలో మండల అధికారు లు, ఉపాధ్యాయులు, ఫిషరీస్ అధికారు లు, మెరైన్ పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వంశధార నదిలో పడి హెచ్‌ఎం మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

నరసన్నపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గోపాలపెంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు నాగేశ్వరరావు(54) వంశధార నదిలో పడి మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... గోపాలపెంట గ్రామానికి చెందిన నాగేశ్వరరావు ఏడాదిగా స్వగ్రామంలోనే హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. స్వంత పనులపై నాగేశ్వరరావు శుక్రవారం పాఠశాలకు సెలవు పెట్టారు. ఇంటి నుంచి స్నానం కోసం శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో వంశధార నదికి వెళ్లి.. సాయంత్రం అయినా రాకపోవడంతో భార్య రమణమ్మ ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు నదీతీరంలో గాలించగా ఒడ్డున నాగేశ్వరరావు బట్టలు ఉండడాన్ని గుర్తించారు. స్నానానికి దిగి నీటి ఉధృతికి గల్లంతై ఉండొచ్చని నిర్ధారించారు. ఈమేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాగేశ్వరరావు మృతదేహం కోసం శనివారం మధ్యాహ్నం వరకు ముమ్మరంగా గాలింపు చేపట్టగా గోపాలపెంట వద్ద లోతైన ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ అసిరినాయుడు తెలిపారు. నాగేశ్వరరావుకి భార్యతోపాటు కుమారులు సునీల్, సుధీర్ ఉన్నారు. కాగా నాగేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూడు పూరిళ్లు దగ్ధం


కాలిపోతున్న పూరిళ్లు

జి.సిగడాం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాడ గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన చల్లా ఆదినారాయణ, అప్పయ్యమ్మ, పులపా నర్సింహులుకు చెందిన పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. నర్సింహులు ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఫ్రిడ్జి, బీరువా, గ్రైండర్, రేషన్ కార్డులు, పలు పత్రాలు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఆస్తినష్టం రూ.3 లక్షలు ఉంటుందని అంచనా. వీఆర్వో సంతోష్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయామని తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులుకోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

- రూ.1,16,058 విలువైన అకేష్ దుంగల స్వాధీనం


పట్టుబడిన కలపతో విజిలెన్స్, అటవీ శాఖాధికారులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న కలపను కేశవరావుపేట జంక్షన్‌కు సమీపంలోని ఓ ప్రైవేటు వేబ్రిడ్జి వద్ద శనివారం విజిలెన్స్ అటవీ శాఖాధికారులు చేపట్టిన తనిఖీల్లో పట్టుకున్నారు. రెండు లారీలు, రెండు వ్యానుల్లో 39.970 టన్నుల బరువు కలిగిన రూ.1,16,058 విలువైన అకేసి దుంగలకు ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్టు గుర్తించారు. అక్రమంగా తరలిస్తున్న కలపతోపాటు నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు విజిలెన్స్ ఎస్‌ఐ రామారావు, అటవీ శాఖాధికారి రాజశేఖర్ తెలిపారు. అక్రమ తరలింపునకు బాధ్యులైన వారిపై ఏపీ ఫారెస్ట్ చట్టం 1967, ఏపీ ఫారెస్ట్ ప్రొడ్యూస్ ట్రాన్సిట్ రూల్స్ 1970 ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఫారెస్ట్ సిబ్బంది ఈశ్వరరావు, కన్నబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మద్యం తాగి హల్‌చల్ చేసిన వ్యక్తికి జైలు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి హల్‌చల్ చేసిన ఓ వ్యక్తికి సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివరాం 45 రోజులు సాధారణ జైలు శిక్ష విధించినట్టు టూ టౌన్ సీఐ ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు పొందూరు మండలం వావిళ్లపేటకు చెందిన కోరుకోల దూర్వాసులు మద్యం తాగి జిల్లా కోర్టులో హల్‌చల్ చేశాడు. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదు మేరకు అతడికి టూటౌన్ పోలీసులు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో 384 పాయింట్లు వచ్చిందని, దూర్వాసులును న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా.. 45 రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్టు సీఐ వివరించారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 237/24 క్రైం నెంబరు ఏ-3లో బంగారు ఆభరణాలు చోరీ కేసులో బిబిఫాను పిషీకా (ముత్యాలు)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5.8 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు



టెక్కలి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి చిన్నబజారు జంక్షన్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శనివారం రాత్రి మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళన చెందు తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తరచూ మంటలు చెలరేగుతున్నాయని, ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మరోసారి శనివారం రాత్రి మంటలు రావడంతో ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు


ఆందోళన చేస్తున్న కార్మికులు

పలాస, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వేతనాలు ఇవ్వకుండా తమను వేధిస్తున్నారని రైల్వే రన్నింగ్ రూమ్‌ల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక రన్నింగ్ రూమ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు కృష్ణకుమారి, భానుప్రియ, జగదీష్ మాట్లాడుతూ 15ఏళ్లుగా తాము వెట్టి చాకిరి చేస్తున్నామని, చార్ట్ ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని, ప్రశ్నిస్తే తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు షిఫ్టులు, డబల్‌డ్యూటీలు చేసినా పనికి తగిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ కేంద్రంలోని కాంట్రాక్టర్ దీన్ని నిర్వహిస్తున్నారు. రూ.15వేలు వేతనంతోపాటు ఇతర అలవెన్స్‌లు అందించాల్సి ఉన్నా నెలకు రూ.7 వేలు మించి ఇవ్వడం లేదన్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా రైలు గార్డులు, డ్రైవర్లు విశ్రాంతికి, భోజనం చేసేందుకు అవసరమైన రెండు రన్నింగ్ రూములు పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్నాయి.


పాతపట్నం: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


పోలాకి: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

‘స్వచ్ఛాంధ్ర’ లక్ష్యాలను సాధించాలి


రణస్థలం: హైస్కూల్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

రణస్థలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ‘స్వ చ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర’ లక్ష్యాలను సాధించాలని విజ యనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బంటు పల్లి పంచాయతీ జడ్పీ హైస్కూల్ ఆవరణలో సర్పంచ్ నడుకుదిటి రజిని ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, రౌతు శ్రీనివాస్, గొర్లె సాయిదీప్, దన్నాన మహేష్, మెన్నె కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్ స్వస్త్ నారీ.. సశక్త్ పరి వార్ అభియాన్‌లో పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం: ఎమ్మెల్యే బగ్గు

పోలాకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేయించారు. వెలుగు, ఉపాధి, అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, మండల ప్రత్యేకాధికారి మధు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పద్మావతి, సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఏవో చిరంజీవి, నాయకులు రోణంకి కృష్ణంనాయుడు, ఎంపీ నాయుడు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆచరణలో చూపాలి: ఎమ్మెల్యే మామిడి

పాతపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధాన్ని ఆచరణలో చూపాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కాగువాడ పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, బావుల్లో క్లోరినేషన్ ఎప్పటికప్పుడు నిర్వహించుకోవాల న్నారు. మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్, తహసీల్దార్ నందిగాం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి: జడ్పీ సీఈవో

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంపై ప్రతీఒక్కరూ ప్రత్యేకశ్రద్ధ చూపాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రావిచెంద్రి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఏపీవో శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- జలుమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రత పచ్చదనంతోనే ఆరోగ్యం వస్తుందని ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోను, కొండపోలవవలస ప్రాథమిక పాఠశాల ఆవరణలోను శనివారం ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.చిన్నమ్మడు, తహసీల్దార్ జె.రామారావు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే శ్రీముఖలింగేశ్వరాలయంలో శనివారం స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవదాయ సిబ్బంది, అర్చకులు, సర్పంచ్ టి.సతీష్ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుభ్రపరిచారు. అర్చకులు వెంకటాచలం, నారాయణమూర్తి, శ్రీకృష్ణ, శివ, అచ్యుత, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

వసప కేజీబీవీలో 10.5 క్వింటాళ్ల బియ్యం సీజ్

- అక్రమ రవాణాకు రహస్య గదిలో నిల్వ
- దసరా సెలవుల్లో దారి మళ్లింపునకు ప్రణాళిక
- అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో వెలుగులోకి..
- తహసీల్దార్ పరిశీలన.. బియ్యం స్వాధీనం


బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

కొత్తూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం పక్కదారి పట్టిన ఘటన వసప కేజీబీవీలో చోటుచేసుకుంది. అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో వసప కేజీబీవీ ప్రిన్సిపాల్ అక్రమాలు వెలుగులో వచ్చాయి. పక్కా సమాచారం అందుకున్న తహసీల్దార్ కొప్పల బాలకృష్ణ శనివారం మధ్యాహ్నం వసప కేజీబీవీని సందర్శించి తనిఖీలు చేపట్టారు. రికార్డులు ప్రకారం స్టాక్ 248 కిలోలు ఉండాల్సి ఉండగా.. వీటికంటే అదనంగా 1150 కిలోల (సుమారు 10.5 క్వింటాలు) బియ్యం ఉన్నట్టు గుర్తించారు. 25 కిలోల చొప్పున్న ఉన్న సుమారు 46 ప్యాకెట్లు పాఠశాలలోని ఓ రహస్య గదిలో సామగ్రితో కలిపి దాచిపెట్టిన బియ్యాన్ని తహసీల్దార్ గుర్తించారు. దీనిపై ప్రిన్సిపాల్ రాధికను తహసీల్దార్ ప్రశ్నించారు. ఎన్నిరోజుల నుంచి విద్యార్థులకు భోజనాలు పెట్టకుండా బియ్యం మిగిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 22వ తేదీ నుంచి దసరా సెలవులు కావడంతో శనివారం విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత వీటిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలుస్తుంది. తమ పిల్లలను పాఠశాలలో చేర్పిస్తే అరకొర ఆహారం అందించి పస్తులు పెడుతుం డడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ప్రిన్సిపాల్ రాధికపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ బాలకృష్ణ మాట్లాడుతూ.. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక వీఆర్వోకు అప్పగించి, చర్యలకై సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీకి నివేదిస్తామని తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎస్‌ఈ వీరంనాయుడు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) వీరంనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షించారు. అనుమతి పొందిన పనులు మండల ఇంజనీర్ల పర్యవేక్షణలో ఎంతవరకు పని చేశారని సహాయకులను అడిగి తెలుసుకున్నారు. డీఈ సుధాకరరావు, జేఈ అంజిత్ కుమార్ ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు



కాశీబుగ్గ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల అవయవ నమోన పరీక్షలు నిర్వహించినట్టు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గోవిదం రావు అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం పలాస నియోజకవర్గం పరిధిలో ఆల్ మెక్కో జిల్లా సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి సంబంధించిన ఉపకరణాలు అందస్తామన్నారు. సోమవారం టెక్కలి నియోజకవర్గంలో, మంగళవారం పాతపట్నంలో బుధవారం శ్రీకాకుళంలో, గురువారం నరసన్నపేటలో, శుక్రవారం ఆమదాలవలసలో, శనివారం ఎచ్చెర్లలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యం, హెచ్‌ఎం చిన్నంనాయుడు, ఉపాధ్యాయులు రవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న జేడీ రాజగోపాల్

నరసన్నపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వాధ్యులు పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధ శాఖ జేడీ రాజగోపాల్ సూచించారు. శనివారం ఉర్లాం పశువైద్యశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పశువులకు ప్రభుత్వం దాణను రాయితీపై అందిస్తుందన్నారు. ఉర్లాం పశువైద్యకేంద్ర నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వచ్చంధ్రా కార్యక్రమంలో భాగంగా నడగాం ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

పోలాకి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ చూపుతున్న దీర్ఘాశి ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరెడ్డి, పీఈటీ జి.ఉషారాణి అభినందించారు. సాఫ్ట్‌బాల్‌లో డి.జగదీశ్వరి, లాంగ్‌జంప్‌లో సీహెచ్ షర్మిల, హైజంప్‌లో ఎం.కీర్తన, వాలీబాల్‌లో షర్మిల, డి.జదదీశ్వరి, ఖోఖోలో డి.గిరిబాబు, ఎస్.హేమలత, జి.పూజిత, ఎల్.ఇషిత రాణిస్తున్నారు.

వైభవంగా శరన్నవరాత్రుల పందిరి రాట


పందిరి రాట వేస్తున్న దృశ్యం

టెక్కలి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీ శరన్నవ రాత్రులు సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో శనివారం వైభవంగా శరన్నవరాత్రి పందిరి రాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపించారు. చంద్రశేఖర రెడ్డి దంపతులు, లక్ష్మణ భవానీ, నారాయణ భవానీ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్

కాశీబుగ్గ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గలో ఉన్న జీడి పిక్కల యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. శనివారం కాశీబుగ్గ మారుతీనగర్‌లో ఉన్న 12 జీడి పిక్కల యూనిట్స్‌ను పరిశీలించారు. పొల్యూషన్, పొగ రాకుండా చూసుకోవాలన్నారు. అలాగే కాశీబుగ్గలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ పూజలు

హిరమండలం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడి నిమజ్జనం హిరమండలంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకామాక్షి స్వర్ణకార సేవా సంఘం ఆధ్వర్యంలో రాత్రి పూజలు న్విర్వహించారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు రూ.20,000 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బుచ్చిబాబు, సర్ణకార సంఘ ప్రతినిధులు మల్లవరపు హరి, జి.కామేశ్వరరావు, లాడే కృష్ణ, దారపు డిల్లేశ్వరరావు, యాళ్ల నాగేశ్వరరావు, ఎస్.గోవింద పాల్గొన్నారు.

- కాశీబుగ్గ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గలో గల ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహానికి శనివారం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. అనంతరం పూజా ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సూర్యనారాయణ, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌బీఐ క్లర్క్ పరీక్షలు


పరీక్షకు హాజరైన అభ్యర్థులు

నరసన్నపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్ టెక్నాలజీలో శనివారం ఎస్‌బీఐ ఉద్యోగాలకు పరీక్షలను నిర్వహించారు. నాలుగు షిఫ్టుల్లో జరిగిన ఈ పరీక్షలకు 800కి 750 మంది హాజరయ్యారు. ఎస్‌బీఐ క్లర్క్‌పోస్టుకు సంబందిచిన అర్హత పరీక్ష నిర్వహించినట్లు నిర్వహకులు తెలిపారు.

తీగ మొక్కలు తొలగించారు..



టెక్కలి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి నుంచి జి.జగన్నాథపురం వరకు వచ్చే విద్యుత్ లైన్‌లో స్తంభాలను అల్లుకున్న తీగ మొక్కలను సంబంధిత అధికారులు తొలగించారు. శనివారం ‘ఆంధ్రజ్యోతి’ పొంచి ఉన్న ప్రమాదం శీర్షికతో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు.

ముక్కు మూసుకోవాల్సిందే

- లక్ష్మీనగర్ కాలనీలో దుర్గంధం
- రోడ్డుపైనే మురుగు నీరు


నరసన్నపేట లక్ష్మీనగర్ వీధిలో మురుగు నీరు

నరసన్నపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మారుతీనగర్ శివారులో గల లక్ష్మీనగర్ వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తుంది. శ్రీరామనగర్, మారుతీనగర్ వీధుల నుంచి వస్తున్న మురుగునీరు జాతీయ రహదారి పక్కనే గల డ్రైనేజీలోకి వెళ్లాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ఆ మురుగునీరంతా వీధుల్లో ప్రవహిస్తుంది. దీంతో కాలనీ వాసులు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారుల మధ్య సమన్వయలోపం కాలనీ వాసులకు శాపంగా మారింది. ఈవో ద్రాక్షాయిణి మాట్లాడుతూ.. ఆక్రమణలపై రెవెన్యూ అధికారులకు తెలియజేశామన్నారు.

సిద్దూరులో పల్లెనిద్ర

హరిపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మందస మండలం సిద్దూరు గ్రామంలో ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మాదక ద్రవ్యాలను రాణియొద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, సారా క్రయవిక్రయాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణ, సిబ్బంది డిల్లేశ్వరరావు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల డిమాండ్లు సాధనకై వచ్చే నెల 7న జరిగే ఛలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు జి.రమణ తెలిపారు. లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తమ డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొల్లిపాడు విద్యార్థుల ఎంపిక

సంతబొమ్మాళి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్, ఖోఖో పోటీలకు కొల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం మెట్ట రామారావు తెలిపారు. టెక్కలిజోన్ నుంచి అండర్-17 విభాగంలో వాలీబాల్ లో డి.మణికంఠ, ఖోఖోలో డి.బుజ్జమ్మ, యు.మౌనిక, అండర్-14 విభాగం ఖోఖోలో జి.సౌమ్య, మన్మథ ఎంపికయ్యారన్నారు. ఉపాధ్యాయులు పిలక ధనుంజయ్ కుమార్, డి.శంకరరావు, కె.శ్రీనివాసరావు అభినందించారు.

ఘనంగా హిందీ సప్తాహం

జలుమూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ సప్తాహం ఘనంగా నిర్వహించారు. జాతీయ హిందీ పక్షోత్సవాలు పురస్కరించుకొని శనివారం ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రాజశేఖర్ భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. విజేత బహుమతులు అందజేశారు. ఉత్సవ్ కన్వీనర్ ఎం.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యుదయ కవి గురజాడ

పాతపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గొప్ప అభ్యుదయ కవి గురజాడ అప్పారావు అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురజాడ జయంతిని ముందస్తుగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో చింతాడ తిరుమల రావు, డాక్టర్ శివరామ కృష్ణ, దార్లపూడి అప్పారావు, హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు, ఉపాధ్యాయులు ఎన్టీ రామారావు, ఎన్ని శేఖర్‌బాబు, అప్పారావు శ్రీను కోటి పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మర్రిపాడు(సి) గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. డేగపొలూరు గ్రామానికి చెందిన పి.బాలరాజు, ముఖందపురం గ్రామానికి చెందిన చరణ్ చాపరలో కూలీ పనులకు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా సడన్ బ్రేక్‌లు వేయడంతో అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో గాయపడిన వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

పరిశుభ్రతలో ముందుడాలి

మెళియాపుట్టి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ ముందుండాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయం నుంచి మూడు రోడ్లు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో రవి, ఎంఈవో దేవేంద్రరావు, తదితరులు ఉన్నారు,

ఆరోగ్యంగా ఉండాలి

టెక్కలి: ఆరోగ్యవంతమైన మహిళలు, శక్తివంతమైన కుటుంబాలు ఉండాలని, అప్పుడే దేశ వ్యాప్తంగా ఆరోగ్య రూపురేఖలు మారుతాయని జిల్లా కేంద్రాసుపత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు, మార్కెట్‌కమిటీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో నిర్వహించిన ‘స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్’లో వారు పాల్గొని మాట్లాడారు. రామకృష్ణ, రాము, షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.